


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 సంచిక :25 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం సోమవారం 30 సెప్టెంబర్ 2024 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE :25 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM MON 30 SEPTEMBER 2024 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Ongole Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur

# దీని అర్థం ఏమిటి చంద్రబాబూ?

## తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో జగన్ స్పందన

## టీటీడీ ఈవో శ్యామలరావు, చంద్రబాబు వ్యాఖ్యల వీడియోలు పంచుకున్న జగన్

## దీనికన్నా వేరే సాక్ష్యం కావాలా? అంటూ ట్వీట్



కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడారన్న ఆరోపణలపై మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ సోషల్ మీడియాలో ఆసక్తికర వీడియోలు పంచుకున్నారు.

ఒక వీడియోలో టీటీడీ ఈవో జె.శ్యామలరావు లడ్డూ తయారీలో వాడిన నెయ్యి కల్తీ జరిగిందని, నెయ్యిలో వనస్పతి వంటి వెజిటబుల్ ఫ్యాట్స్ ఉన్నట్టు వెల్లడైందని వివరించారు. దాంతో, ఆ నెయ్యి సరఫరాదారును బ్లాక్ లిస్ట్ లో ఉంచామని తెలిపారు. రెండు ట్యాంకర్ల నెయ్యిని తిప్పి పంపామని వెల్లడించారు.

శ్యామలరావు ఈ వ్యాఖ్యలు చేసింది జులై 23వ తేదీ కాగా... సెప్టెంబరు 18న సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యల వీడియోను కూడా జగన్ పంచుకున్నారు. తిరుపతి లడ్డూ తయారీలో వాడిన నెయ్యిలో జంతువుల కొవ్వు ఉందని చంద్రబాబు పేర్కొనడం ఆ వీడియోలో చూడొచ్చు. దీనిపై జగన్ స్పందిస్తూ... దీనర్థం ఏమిటి చంద్రబాబూ? అని ప్రశ్నించారు. దీనికన్నా వేరే సాక్ష్యం కావాలా? సత్యమేవ జయతే అంటూ ట్వీట్ చేశారు.

## సనాతన ధర్మాన్ని తానే కనుగొన్నట్టు పవన్ మాట్లాడుతున్నారు

- తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో కూటమి నేతలు వర్సెస్ వైసీపీ నేతలు
- చంద్రబాబు తప్పు చేశాడు కాబట్టే పవన్ ప్రాయశ్చిత్త దీక్ష చేస్తున్నాడన్న వెల్లంపల్లి
- ఎవరైనా చెప్పులు వేసుకుని దీక్ష చేస్తారా? అంటూ విమర్శలు



పెన్ పవర్ డెస్క్:తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారం నేపథ్యంలో కూటమి నేతలకు, వైసీపీ నేతలకు మధ్య మాటల యుద్ధం

వివరాలు 2లో..

## చంద్రబాబుతో నాకు 18 ఏళ్లుగా సోదర అనుబంధం ఉంది

### లులూ అధినేత యూసుఫ్ అలీ



- సీఎం చంద్రబాబుతో మొన్న భేటీ అయిన లులూ అధినేత
- లులూ మళ్లీ వస్తోందంటూ చంద్రబాబు హర్షం
- చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపిన యూసుఫ్ అలీ

పెన్ పవర్ డెస్క్:ఏపీ సీఎం చంద్రబాబును లులూ గ్రూప్ అధినేత యూసుఫ్ అలీ మొన్న అమరావతిలో కలిసిన సంగతి తెలిసిందే. లులూ మళ్లీ వస్తోందంటూ దీనిపై చంద్రబాబు ఎంతో సంతోషంతో ప్రకటన కూడా చేశారు. ఈ

వివరాలు 2లో..


## మంగళగిరిలో క్లీన్ అండ్ గ్రీన్... సొంత డబ్బుతో పనులు చేయిస్తున్న మంత్రి నారా లోకేశ్

### సొంత నియోజకవర్గంపై దృష్టి సారించిన మంత్రి నారా లోకేశ్

### ఐదు గ్రాస్ కటింగ్ మిషన్ల కొనుగోలు

### కార్మికులకు కూడా సొంత డబ్బుతో జీతాలు

### హర్షం వ్యక్తం చేస్తున్న మంగళగిరి



పెన్ పవర్ డెస్క్:మంగళగిరి నియోజకవర్గాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉంచడంపై రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీ శాఖల మంత్రి నారా లోకేశ్ దృష్టి సారించారు. నియోజకవర్గాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు సొంతంగా 5 గడ్డి కత్తిరించే మిషన్లు కొనుగోలు చేయడంతో పాటు... వాటిని వినియోగించి

వివరాలు 2లో..

## బావమరిదితో లీగల్ నోటీసు పంపితే మాట్లాడడం ఆపేస్తాననుకున్నావా!

- బావమరిదికి అమృతం పంచి, పేదలకు విషం ఇస్తావా అంటూ కేటీఆర్ ఫైర్
- ఢిల్లీలోని నీ బీజేపీ దోస్తులు నిన్ను కాపాడడం కష్టమేనంటూ ట్వీట్
- ఆదర్శ్ స్కాంలో అశోక్ చవాన్ లాగా నువ్వు దొరికావంటూ వ్యాఖ్యలు



పెన్ పవర్ డెస్క్:సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు పోరాటం ఉద్ధృతం చేశారు. తాజాగా, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోషల్ మీడియాలో ఆసక్తికరంగా స్పందించారు. ముఖ్యమంత్రి తాను నిర్వహిస్తున్న శాఖలోనే తన బావమరిదికి చెందిన శోద కంపెనీకి రూ.1,137 కోట్లు

వివరాలు 2లో..

## ఎమ్మెల్యే రాజా సింగ్ ఇంటి ముందు యువకుల రెక్కీ..?



- ఇద్దరు యువకులను అరెస్ట్ చేసిన పోలీసులు
- మంగళ్ హాట్ స్టేషన్ లో విచారిస్తున్న అధికారులు
- ఇద్దరి మొబైల్ ఫోన్లలో రాజా సింగ్, గన్, బుల్లెట్ల ఫొటోలు

పెన్ పవర్ డెస్క్: హైదరాబాద్ లో బీజేపీ ఎమ్మెల్యే రాజా సింగ్ ఇంటి వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గోషామహల్ లోని ఎమ్మెల్యే ఇంటి వద్ద యువకుల కదలికలు అనుమానాస్పదంగా కనిపించడంతో స్థానికులు పోలీసులకు ఫోన్ చేశారు. దీంతో హుటాహుటిన

వివరాలు 2లో..

## కొనసాగుతున్న ఇజ్రాయెల్ వేట... హిజ్బొల్లా డిప్యూటీ హెడ్ కూడా హతం



- పశ్చిమాసియాలో భీకర పోరు
- మిలిటెంట్ సంస్థల అగ్రనేతలను టార్గెట్ చేస్తున్న ఇజ్రాయెల్
- ఇప్పటికే హిజ్బొల్లా చీఫ్ నస్రల్లా హతం
- తాజాగా రాకెట్ దాడుల్లో హిజ్బొల్లా అగ్రశ్రేణి కమాండర్ నబిల్ మృతి

పెన్ పవర్ డెస్క్:హమాస్, హిజ్బొల్లా మిలిటెంట్ సంస్థలను నామరూపాల్లేకుండా చేయాలని ఇజ్రాయెల్ కంకణం కట్టుకుంది. ఇప్పటికే హిజ్బొల్లా చీఫ్ సయ్యద్ హసన్ నస్రల్లాను హతమార్చిన ఇజ్రాయెల్... లెబనాన్ భూభాగంలో ఇవాళ జరిపిన దాడుల్లో హిజ్బొల్లా డిప్యూటీ హెడ్ నబిల్ కౌక్ ను అంతమొందించింది. నబిల్ కౌక్ ను రాకెట్ దాడులతో మట్టుబెట్టినట్టు ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. అయితే, కౌక్ మృతి పట్ల హిజ్బొల్లా నుంచి ఎలాంటి ప్రకటన

వివరాలు 2లో..

## రేవంత్ అంకుల్.. మా ఇల్లు కూల్చేయద్దు ప్లీజ్..

### హైడ్రా కూల్చివేతలకు వ్యతిరేకంగా రోడ్డెక్కిన చిన్నారులు

### ఫ్లెక్సీలు ప్రదర్శిస్తూ నినాదాలు చేసిన పిల్లలు

### మా పేరెంట్స్ ను చూస్తే బాధనిపిస్తోందని మీడియాతో వ్యాఖ్యలు



పెన్ పవర్ డెస్క్:హైడ్రా కూల్చివేతలకు వ్యతిరేకంగా చిన్నారులు రోడ్డెక్కారు.. చేతులో ప్లకార్డులు, ఫ్లెక్సీలు పట్టుకుని నినాదాలు చేశారు. రేవంత్ అంకుల్ మా ఇల్లు కూల్చేయద్దు ప్లీజ్ అంటూ ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. చిన్నారుల నిరసనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. దీనిపై పలువురు నెటిజన్లు విమర్శలు గుప్పిస్తున్నారు. రేవంత్ రెడ్డి సర్కారు చివరికి

వివరాలు 2లో..

## తిరుమల శ్రీవారి దర్శనం చేసుకున్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్

- కుటుంబ సమేతంగా తిరుమల విచ్చేసిన సీజేఐ
- వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారా శ్రీవారి ఆలయంలో ప్రవేశం
- వేదాశీర్వచనం అందించిన అర్చకులు



పెన్ పవర్ డెస్క్:సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేడు కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. సీజేఐ చంద్రచూడ్, ఆయన అర్ధాంగి కల్పనా దాస్, ఇతర కుటుంబ సభ్యులు వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారా ఆలయంలోకి ప్రవేశించారు. దర్శనం అనంతరం రంగనాయకుల

వివరాలు 2లో..

## శ్రీవారి సేవకు టికెట్ ఖరీదు రూ.కోటిన్నర.. దక్కించుకుంటే జన్మధన్యమే!

- సుప్రభాతం నుంచి శ్రీవారు ఏకాంత సేవ దాకా అన్ని సేవల్లో పాల్గొనే అవకాశం
- టికెట్ కొనుగోలు చేసిన వారితో పాటు ఆరుగురు కుటుంబ సభ్యులకు అనుమతి
- వారంలో ఆరు రోజులు టికెట్ ఖరీదు రూ.కోటి.. శుక్రవారం మాత్రం కోటిన్నర

వివరాలు 2లో..



పెన్ పవర్ డెస్క్:తిరుమలలో వైఖానస ఆగమం ప్రకారం శ్రీహరికి నిత్యం ఎన్నో కైంకర్యాలను నిర్వహిస్తారు.. ఇందులో పలు ఆర్జిత సేవల్లో పాల్గొనే అవకాశం భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కల్పిస్తోంది. ఆర్జిత సేవా టికెట్లు పొందిన వారు స్వామి వారిని దగ్గర నుంచి కొలుచుకోవచ్చు.

## అన్యమతస్తుడైన ఏపీ గవర్నర్ తిరుమలలో డిక్లరేషన్ ఇచ్చారా .. టీడీపీ, బీజేపీపై మాజీ మంత్రి పేర్ని నాని ధ్వజం

- తెలంగాణ బీజేపీ నాయకురాలిపై నాని ఆగ్రహం
- రైలులో భజన చేసుకుంటూ వచ్చిందంటూ నాని ఫైర్
- అన్యమతస్థుడిని డిక్లరేషన్ లేకుండా మోదీ ఎలా తీసుకువెళ్లారని బీజేపీ నేతలు ప్రశ్నించారా అంటూ నాని ఆగ్రహం



పెన్ పవర్ డెస్క్:తెలంగాణకు చెందిన బీజేపీ నాయకురాలిపై ఏపీ మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని నాని ధ్వజమెత్తారు. తెలంగాణ బీజేపీ నుండి ఒకామె భజన చేసుకుంటూ తిరుమలకు వచ్చిందని, ఇది దిక్కుమాలిన తనమని దుయ్యబట్టారు. ఆమె ఆసుపత్రిలో భజన చేసుకోవాలని హితవు

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# జేసీబీ రైతు పెట్టిన కంపెనీ

సాధారణంగా కొన్ని వస్తువులను వాటిని తయారుచేసిన వ్యక్తుల పేర్లతోనే పిలుస్తుంటారు. లేదంటే.. ఆ వస్తువుని మొదటగా మార్కెట్‌లోకి తెచ్చిన కంపెనీ పేరుతో పిలుస్తుంటారు. జిరాక్స్, జీప్, డంప్‌స్టర్, డాల్డా అలా వచ్చినవే. అలాగే కొన్నేండ్ల క్రితం బుల్డోజర్లు(ఎక్స్‌కవేటర్లు) మార్కెట్‌లోకి వచ్చినప్పుడు దాన్ని తెచ్చిన కంపెనీ, తయారుచేసిన వ్యక్తి జేసీబీ(జోసెఫ్ సిరిల్ బామ్‌ఫోర్డ్) పేరుతోనే పిలవడం మొదలైంది. ఏండ్లు గడిచినా, కొత్త టెక్నాలజీలు వచ్చినా జేసీబీకి ఉన్న క్రేజ్ మాత్రం తగ్గడం లేదు. నిర్మాణరంగంలో ప్రపంచవ్యాప్తంగా గొప్ప విప్లవం తెచ్చిన జోసెఫ్ సిరిల్ బామ్‌ఫోర్డ్ పేరులోని మొదటి అక్షరాలతో జేసీబీ కంపెనీకి ఆ పేరుపెట్టారు. జేసీబీ స్టోరీ రెండో ప్రపంచ యుద్ధం తర్వాత మొదలైంది. జోసెఫ్‌ది ఇంగ్లాండ్‌లోని ఉటోక్సెటర్. అతను యువరైతు. వ్యవసాయం చేస్తున్నప్పుడు అతనికి మరింత ఎఫెక్టివ్‌గా పనిచేసే పరికరాలు అవసరం అనిపించింది. అందుకే అతనికి వ్యవసాయంలో తలెత్తిన ప్రతి సమస్యకు పరిష్కారాన్ని కనుక్కోవాలని అనుకున్నాడు. అందులో భాగంగానే తన పొలంలో ఒక చిన్న వర్క్‌షాప్ ఏర్పాటు చేసుకున్నాడు. అందులోనే తనకు కావాల్సిన పరికరాలు తయారుచేసుకునేవాడు. 1945లో యుద్ధం ముగిశాక తన గ్యారేజీలో వ్యవసాయ టిప్పింగ్ ట్రైలర్‌లను డెవలప్ చేయడం మొదలుపెట్టాడు. అందుకోసం రెండో ప్రపంచ యుద్ధం నాటి స్క్రాప్‌ని వాడుకున్నాడు. అలా తయారుచేసిన మొదటి టిప్పింగ్ ట్రైలర్‌ను అదే టౌన్‌లో ఉన్న మార్కెట్‌లో 45 డాలర్లకు అమ్మాడు. ఆ తర్వాత వారం రోజుల్లో మరో ట్రైలర్ రెడీ చేశాడు. దాన్ని కూడా 45 డాలర్లకు అమ్మాడు. దాంతో అలాంటి ట్రైలర్లకు డిమాండ్ ఉందనే విషయం అర్థమైంది. దాంతో భారీగా ప్రొడక్షన్ మొదలుపెట్టాడు. అప్పటినుంచి వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు అతనికి. 1947 నాటికి కంపెనీ తయారుచేసే అన్ని వస్తువులకు మంచి పేరొచ్చింది. క్వాలిటీకి మారుపేరుగా నిలిచాయి. దాంతో కంపెనీ ఫుల్‌టైం ఉద్యోగులను రిక్రూట్ చేసుకుంది. ఆ తర్వాత1949లో 'జేసీబీ మేజర్ లోడర్' పేరుతో ఒక లోడర్‌ని తీసుకొచ్చింది. ఇది వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. ఈ లోడర్ ఇచ్చిన సక్సెస్‌తో 'ఎంకే 1' పేరుతో ఎక్స్‌కవేటర్‌ని తీసుకొచ్చింది. ఇప్పుడు మనం చూస్తున్న ఎక్స్‌కవేటర్లకు కూడా ఇదే ఇన్‌స్పిరేషన్.

**మొదటి కంపెనీ**

ప్రపంచ యుద్ధం తర్వాత వచ్చి బాగా డెవలప్ అయిన కంపెనీల లిస్ట్‌లో జేసీబీ మొదటి వరుసలో ఉంది. యుద్ధం వల్ల కలిగిన నష్టాల నుంచి కోలుకుంటున్న ఇంగ్లాండ్ అగ్రికల్చర్ మార్కెట్‌ను జేసీబీ స్వాధీనం చేసుకుంది. 1948 నుంచి తీసుకొచ్చిన 'హైడ్రాలిక్స్' వల్ల కంపెనీకి బాగా పేరొచ్చింది. యూరప్‌లో హైడ్రాలిక్ లోడర్‌ను తీసుకొచ్చిన మొదటి కంపెనీ ఇది. ఈ లోడర్‌కి రకరకాల అటాచ్‌మెంట్స్ చేసుకునేలా తయారుచేశారు. అందుకే అంతలా సక్సెస్ అయ్యింది. అంతేకాదు.. జేసీబీ ఎంకే1లో హైడ్రాలిక్ రియర్ ఎక్స్‌కవేటర్, ముందు మౌంటెడ్ లేయర్ ఉన్నాయి. ఇలా రెండు పనులు చేసే ఒకే మెషిన్‌ని తయారుచేయడం అదే మొదటిసారి. దాంతో వాటికి బాగా గిరాకీ పెరిగింది. అప్పుడే ఎక్స్‌పోర్ట్స్ కూడా మొదలుపెట్టడడంతో జేసీబీ 'లోగో'– ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. –

**మ్యాన్ పవర్ తగ్గింది**

జేసీబీ తీసుకొచ్చిన బ్యాక్‌హో వల్ల1960ల నాటికి వ్యవసాయ, నిర్మాణ రంగాల్లో కార్మికుల సంఖ్య తగ్గింది. చాలా పనులకు జేసీబీలను వాడడం మొదలైంది. ఆ సక్సెస్‌తో కంపెనీని విస్తరించారు. వాస్తవానికి అందరూ జేసీబీ కేవలం నిర్మాణ, వ్యవసాయ రంగ ఉత్పత్తులు మాత్రమే తయారుచేస్తుంది అనుకుంటారు. కానీ.. ఈ కంపెనీ 1961లోనే ఏవియేషన్ రంగంలోకి కూడా అడుగుపెట్టింది. కంపెనీ మొట్టమొదటి విమానం ట్విన్ ఇంజిన్ 'డి హావిలాండ్ డోవ్'ని తీసుకొచ్చింది. ఇప్పుడున్న ఎన్నో ఏవియేషన్ కంపెనీల కంటే జేసీబీ చాలా పాత కంపెనీ. ఈ కంపెనీ విమానరంగంలో కూడా సక్సెస్ కావడంతో 1962లో మొదటిసారిగా హాలాండ్ దేశంలో అమ్మకాలు మొదలుపెట్టింది. 1964లో అమ్మకాలు విపరీతంగా పెరిగాయి. అప్పుడే కంపెనీ మొదటిసారిగా అమెరికాకు ఎగుమతి చేయడం మొదలుపెట్టింది. 1969లో జేసీబీ రికార్డు స్థాయిలో 4,500 మెషిన్లను ఉత్పత్తి చేసింది. వాటిలో సగానికి పైగా ఎగుమతి చేసింది. 1971 %–%1973 మధ్య టర్నోవర్ రెండింతలు పెరిగింది. ఆ తర్వాత 1979లో ఇండియాలో తయారీని ప్లాంట్ స్టార్ట్ చేసింది. ప్రస్తుతం జేసీబీకి న్యూ ఢిల్లీ, పూనే, జైపూర్‌లలో ఫ్యాక్టరీలు ఉన్నాయి. యూకే తర్వాత జేసీబీకి అతిపెద్ద మార్కెట్ ఇప్పటికీ ఇండియాలోనే ఉంది.

**కొత్త రంగాల్లోకి...**

1990 నాటికి జేసీబీ ఫాస్ట్‌ట్రాక్ ట్రాక్టర్‌ను ప్రారంభించడంతో మరో కొత్త రంగంలోకి ప్రవేశించింది. ఇది ప్రపంచంలోనే మొట్టమొదటి హై–స్పీడ్, ఫుల్ సస్పెన్షన్ ట్రాక్టర్. దీన్ని డెవలప్ చేయడానికి కంపెనీ 12 మిలియన్ల డాలర్లు ఖర్చు చేసింది. అప్పట్లో దీని సేల్స్ చాలా బాగా జరిగాయి. ఇలా కంపెనీ సక్సెస్‌కి ఎన్నో రకాలుగా కారణమైన జోసెఫ్ సిరిల్ బామ్‌ఫోర్డ్ 2001 మార్చి1న చనిపోయాడు. అప్పటినుంచి కంపెనీని అతని వారసులే నడుపుతున్నారు.

**సక్సెస్‌కు కేరాఫ్**

ఒక చిన్న షెడ్డులో వ్యవసాయ టిప్పింగ్ ట్రైలర్‌ల తయారీతో మొదలైన కంపెనీ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఎన్నో దేశాలకు ఎగుమతులు చేస్తోంది. కంపెనీకి నాలుగు ఖండాల్లో 22 ప్లాంట్లు ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా డీలర్లు ఉన్నారు. దాదాపు 50 ఏండ్లుగా వరల్డ్ ఫేమస్ బ్రాండ్‌గా ఉంది. ముఖ్యంగా ఇండియాతో కంపెనీకి మంచి అనుబంధం ఉంది. నాలుగు దశాబ్దాల క్రితం భారతదేశంలోకి అడుగుపెట్టిన కంపెనీ 'బ్యాక్‌హో, లోడర్ల'ను పరిచయం చేసింది. కంపెనీకి ప్రపంచంలోనే అతిపెద్ద ఫ్యాక్టరీ మనదేశంలో ఉంది. ప్రస్తుతం కంపెనీ ట్రాక్డ్ ఎక్స్‌కవేటర్లు, వీల్డ్ లోడర్లు, స్కిడ్ స్టీర్ లోడర్‌లు, టెలిహ్యాండ్లర్‌లు, డీజిల్ జనరేటర్లు, డీజిల్ ఇంజన్ మెషిన్లు తయారుచేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా150 దేశాల్లో అమ్మకాలు చేస్తోంది.

**సక్సెస్‌కు కారణాలివి...**

కంపెనీ ఎప్పటికప్పుడు కొత్త కొత్త ఇన్నొవేషన్‌లకు ప్రాధాన్యం ఇస్తుంది. జోసెఫ్ మొదటి నుండి పరికరాలను తయారుచేయడంలో కొత్త, మెరుగైన మార్గాలను వెతికేవాడు. అందుకే తక్కువ ఖర్చుతో క్వాలిటీ పరికరాలను తయారుచేయగలిగేవాళ్లు. కంపెనీ ఇప్పటికీ ఆ స్ఫూర్తితోనే నడుస్తోంది. అంతేకాకుండా కంపెనీ తన ప్రొడక్ట్స్‌ని ఇంకా బెటర్ చేయడానికి ఎప్పుడూ కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకుంటుంది. ఉదాహరణకు.. ఫ్యుయెల్ వాడకం తగ్గించేందుకు ఈ మధ్య హైబ్రిడ్, ఎలక్ట్రిక్ వెహికల్స్‌ని కూడా డెవలప్ చేసింది ఈ కంపెనీ.

సేఫ్టీ విషయంలో జేసీబీ చాలా జాగ్రత్తలు తీసుకుంటుంది. ఈ కంపెనీ ప్రొడక్ట్స్ ఉపయోగించే వాళ్ల సేఫ్టీ కోసం కొత్త మార్గాలను కనుగొనడానికి చాలా ఖర్చు చేస్తుంది. ఉదాహరణకు.. నిర్మాణ ప్రదేశాల్లో జరిగే యాక్సిడెంట్స్ తగ్గించడానికి ఆటోమేటిక్ బ్రేకింగ్ సిస్టమ్స్ డెవలప్ చేసింది. అంతేకాదు.. కంపెనీ వెహికల్స్ సరిగ్గా ఆపరేట్ చేసేందుకు కస్టమర్లకు ట్రైనింగ్, సపోర్ట్ కూడా ఇస్తోంది. కంపెనీ తీసుకొచ్చిన ప్రొడక్ట్స్ సక్సెస్ అయ్యాయని అంతటితో ఆగలేదు. పోర్ట్‌ఫోలియో డైవర్సిటీని పాటించింది. వెహికల్స్ తయారీతోపాటు పవర్ సొల్యూషన్స్, వ్యవసాయ పరికరాలు, రీసైక్లింగ్ టూల్స్.. ఇలా అనేక రకాల ప్రొడక్ట్స్ మీద ఇన్వెస్ట్ చేసింది. ఈ డైవర్సిఫికేషన్ కంపెనీ కొత్త మార్కెట్లలోకి అడుగులు వేసేలా చేసింది. దాంతో ఆదాయ మార్గాలు పెరిగాయి. వెహికల్స్ తయారీలో కార్మికులు ఇబ్బంది పడకుండా, ప్రొడక్షన్ వేగంగా జరిగేలా ఎప్పటికప్పుడు సౌకర్యాలు కల్పిస్తుంటుంది. ప్రపంచవ్యాప్తంగా అత్యాధునిక మాన్యుఫాక్చరింగ్ సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చింది. ఉదాహరణకు, యూకేలోని స్టాన్‌ఫోర్డ్‌షైర్‌లోని జేసీబీ ఫ్యాక్టరీలో త్రీడీ ప్రింటింగ్, రోబోటిక్స్ లాంటి ఆధునిక పద్ధతులను ఉపయోగిస్తున్నారు. క్వాలిటీ విషయంలో కంపెనీ ఎప్పుడూ రాజీపడలేదు. కఠినమైన క్వాలిటీ కంట్రోల్ విధానాలను పాటిస్తుంది. జేసీబీ ప్రొడక్ట్స్ ఛాలెంజింగ్ కండిషన్స్‌ని కూడా తట్టుకుని పనిచేస్తాయి. సేవలో కూడా ముందే. ఈ సంస్థ అనేక స్వచ్ఛంద కార్యక్రమాల్లో పాల్గొంటుంది. ఉదాహరణకు.. జేసీబీ కంపెనీ ఉన్న దేశాల్లో స్కూల్స్, హెల్త్ క్లినిక్స్ కట్టించింది. ఎన్విరాన్‌మెంట్ సేఫ్టీ కార్యక్రమాలను కూడా మొదలుపెట్టింది.

**ఇన్నొవేషన్ మైల్‌స్టోన్స్**

1949: జేసీబీ మేజర్ లోడర్ వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. 1952: ఎంకే1 ఎక్స్‌కవేటర్‌తో జేసీబీ బ్యాక్‌హో లోడర్‌ని తెచ్చింది. 1963 : జేసీబీ 3సీ బ్యాక్‌హో పర్ఫార్మెన్స్‌ని పెంచారు. 1964 : జేసీబీ7 అనే మొదటి క్రాలర్ ఎక్స్‌కవేటర్‌ని మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. 1971 : జేసీబీ 110 హైడ్రోస్టాటిక్ క్రాలర్ లోడర్ ఇన్నొవేషన్. 1977: జేసీబీ 520 టెలిస్కోపిక్ హ్యాండ్లర్. 1980: జేసీబీ3సీఎక్స్.. ఒకే వెహికల్‌తో రెండు రకాల పనులు చేసుకోవచ్చు.

1990: జేసీబీ ఫాస్ట్‌ట్రాక్ ప్రపంచంలోనే మొట్టమొదటి ఫుల్ సస్పెండెడ్, హై–స్పీడ్ డ్రాఫ్ట్ ట్రాక్టర్. 1993: జేసీబీ రోబోట్ స్కిడ్ స్టీర్ లోడర్.. ప్రపంచంలోనే అత్యంత సేఫ్టీ స్కిడ్ స్టీర్. 1997: జేసీబీ టెలిట్రక్. 2006: జేసీబీ 444 డీజిల్ ఇంజిన్లు. 2010: జేసీబీ ఎకో మెషిన్లు.. మెషిన్ కెపాసిటీని, ప్రొడక్షన్‌ని పెంచాయి.

**ఒకే ఏడాదిలో లక్ష**

జేసీబీ1985లో 3సీఎక్స్ సైట్‌మాస్టర్ బ్యాక్‌హో లోడర్‌ని మార్కెట్‌లోకి తెచ్చింది. కంపెనీ తెచ్చిన బ్యాహోల్లో అత్యధికంగా అమ్ముడైంది ఇదే. అంతేకాదు.. ఒకే ఏడాదిలో లక్ష బ్యాక్‌హోలను ప్రొడ్యూస్ చేసింది కంపెనీ. ఆ సక్సెస్‌ని చూసిన బ్రిటన్ మొదటి మహిళా ప్రధాన మంత్రి మార్గరెట్ థాచర్ 1987లో జేసీబీ కంపెనీకి వెళ్లింది కూడా.

ఎక్స్‌కవేటర్లు%–% ఇవి నిర్మాణ రంగంలో, పొలాల్లో రకరకాల పనులు చేస్తుండటం చూసే ఉంటారు. కానీ వాటిని ఎక్స్‌కవేటర్లు అంటారనే విషయం చాలామందికి తెలియదు. వీటిని 'జేసీబీ' అనే పిలుస్తుంటారు. వాస్తవానికి జేసీబీ అంటే ఎక్స్‌కవేటర్లు తయారుచేసే కంపెనీ పేరు. అదే ఆ కంపెనీ యజమాని పేరు కూడా.

ఒక పొలంలో చిన్న గ్యారేజీలో మొదలైన జేసీబీ చెక్కర్లు కొడుతూ.. 150 దేశాలకు ట్రావెల్ చేసింది.

## శ్రీవారి సేవకు టికెట్ ఖరీదు రూ.కోటిన్నర..

# దక్కించుకుంటే జన్మధన్యమే!

- మొదటి పేజీ తరువాయి

సర్వదర్శనం, దివ్య దర్శనాలతోపాటు నిత్య, వార పూజలు, సేవలలో ప్రత్యేకమైన, విశేషమైన సేవ ఒకటుంది. అదే ఉదయాస్తమాన సేవ. ఈ సేవ టికెట్ కు ఏకంగా రూ. కోటిన్నర వెచ్చించాల్సి ఉంటుంది. వారంలో ఆరు రోజులు రూ.కోటి ఉండే ఈ టికెట్ ఖరీదు శుక్రవారం మాత్రం రూ. కోటిన్నరగా టీటీడీ నిర్ణయించింది.

ఈ ఉదయాస్తమాన సేవ టికెట్ పొందిన వారు ఉదయం సుప్రభాత సేవ నుంచి రాత్రి ఏకాంతసేవ వరకూ శ్రీనివాసుడి సకల వైభోగాలనూ తిలకించే భాగ్యం కలుగుతుంది. టికెట్ కొనుగోలు చేసిన వారితో పాటు ఆరుగురు కుటుంబ సభ్యులకు అనుమతి ఉంటుంది. ఏడాదికి ఓసారి స్వామి వారి నిత్య సేవల్లో పాల్గొనే అరుదైన అవకాశం ఈ ఉదయాస్తమాన సేవ. ఈ సేవ టికెట్ ను దక్కించుకుంటే జన్మధన్యమైనట్టేనని భక్తులు అంటున్నారు.

**1980 లలో ప్రారంభం..**

ఉదయాస్తమాన సేవ టికెట్ ను టీటీడీ 1980 లలో భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చింది. శ్రీపద్మావతి సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి రూ.కోటి ఆపైన విరాళాలు అందించే భక్తులకు ఈ టికెట్లను కేటాయిస్తూ ధర్మకర్తల మండలి తీర్మానం చేసింది. మధ్యలో కొంతకాలం ఈ టికెట్ల జారీని నిలిపివేసిన టీటీడీ.. 2021 నుంచి మళ్లీ అందుబాటులో ఉంచింది. ప్రస్తుతం 347 సేవా టికెట్లు అందుబాటులో ఉన్నాయి.

**సంస్థలకూ అవకాశం..**

వ్యక్తులతో పాటు సంస్థలు కూడా ఈ టికెట్ కొనుగోలు చేసే వీలుంటుంది. ఏడాది పొడవునా ఏ రోజైనా ఎంచుకుని రోజంతా శ్రీవారి సేవల్లో పాల్గొనవచ్చు. ఒకసారి టికెట్ కొనుగోలు చేసిన వారు పాతికేళ్ల పాటు లేదా జీవితకాలం.. ఏది ముందైతే అందుకు తగ్గట్టుగా ఈ టికెట్‌ను వినియోగించుకోవచ్చు. సేవల్లో పాల్గొన్న తర్వాత స్వామికి అర్పించిన వస్త్రాలూ, ప్రసాదాలూ ఈ టికెట్ కొనుగోలు చేసిన భక్తుడికి అందిస్తారు. అయితే, శ్రీవారి సేవల్లో మార్పులతో ఎప్పుడైనా దర్శనాన్ని రద్దుచేసే హక్కు టీటీడీకి ఉంటుంది.

## అన్యమతస్తుడైన ఏపీ గవర్నర్ తిరుమలలో డిక్లరేషన్ ఇచ్చారా ..

# టీడీపీ, బీజేపీపై మాజీ మంత్రి పేర్ని నాని ధ్వజం

- మొదటి పేజీ తరువాయి

పలికారు. బిల్లుల పేరుతో ఆసుపత్రిలో దోచుకుంటూ రైలులో భజన చేసుకుంటూ వచ్చిందని, ఆమె ఆసుపత్రిలో హిందువులకు రూపాయి తగ్గించిందా అంటూ మండిపడ్డారు. ఆమె ఆసుపత్రి బాగోతాలు తెలియవా అని ప్రశ్నించారు.

తిరుమల డిక్లరేషన్ పై నాని స్పందిస్తూ గతంలో మోదీతో పాటు ఏపీ గవర్నర్ సైతం తిరుమలకు వెళ్లారని, ఆయన డిక్లరేషన్ ఇచ్చారా అని ప్రశ్నించారు. అన్యమతస్థుడిని డిక్లరేషన్ లేకుండా మోదీ ఎందుకు తీసుకువెళ్లారని బీజేపీ నేతలు ప్రశ్నించారా అని నిలదీశారు. హైందవ మతాన్ని, దేవుడిని నమ్మేవాడు బూట్లు వేసుకుని పూజలు చేస్తాడా అని ప్రశ్నించారు. బూట్లు వేసుకుని చంద్రబాబు పూజలు చేశారని, అందుకు సంబంధించి అనేక వీడియోలు, ఫోటోలు సాక్ష్యాలుగా ఉన్నాయన్నారు. అటువంటి ఆయనను గురించి పవన్ మెచ్చుకోలుగా మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. హిందూత్వంపై మాట్లాడే బాబు తన తల్లిదండ్రులు చనిపోతే తలవెంట్రుకలు ఎందుకు తీయించుకోలేదని నాని ప్రశ్నించారు. ఎవరు ఏమి పాటిస్తున్నారు.. వారు మాట్లాడుతున్న భాష ఏమిటి అంటూ నాని ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుమల వెంకన్నపై నమ్మకం లేకుండానే జగన్ మెట్లెక్కి నడుచుకుంటూ వెళ్లి దర్శనం చేసుకొని వచ్చారా అని అడిగారు.

# సనాతన ధర్మాన్ని తానే కనుగొన్నట్టు పవన్ మాట్లాడుతున్నారు

- మొదటి పేజీ తరువాయి

నడుస్తోంది. తాజాగా ఈ అంశంలో వైసీపీ నేత, మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు స్పందించారు. హిందూ సనాతన ధర్మాన్ని కొత్తగా తానే కనుగొన్నట్టు పవన్ కల్యాణ్ మాట్లాడుతున్నారని విమర్శించారు.

పవన్ ప్రాయశ్చిత్త దీక్ష చేయడంలో ఆశ్చర్యమేమీ లేదని వ్యాఖ్యానించారు. తప్పు చేసిన వాళ్లే ప్రాయశ్చిత్త దీక్ష చేస్తారని... తిరుపతి లడ్డూలపై చంద్రబాబు తప్పు చేశాడు కాబట్టే పవన్ ప్రాయశ్చిత్త దీక్ష చేస్తున్నాడని అన్నారు. అయినా, దీక్ష చేసేవాళ్లు చెప్పులు వేసుకుని దీక్ష చేస్తారా? దీక్ష చేసేవాళ్లు సినిమాలు చేయొచ్చా? ఇదేనా పవన్ చిత్తశుద్ధి? అని ప్రశ్నించారు. సనాతన ధర్మం అంటూ పవన్ రాజకీయాలు చేస్తున్నారని వెల్లంపల్లి విమర్శించారు.

## బావమరిదితో లీగల్ నోటీసు పంపితే

# మాట్లాడడం ఆపేస్తాననుకున్నావా!

- మొదటి పేజీ తరువాయి

కట్టబెట్టింది నిజం... అవినీతి నిరోధక చట్టంలోని 7, 11, 13 సెక్షన్లను ముఖ్యమంత్రి ఉల్లంఘించింది నిజం అని స్పష్టం చేశారు. "బావమరిదితో లీగల్ నోటీసు పంపితే నీ ఇల్లీగల్ దందాల గురించి మాట్లాడడం ఆపేస్తాననుకున్నావా? బావమరిదికి అమృతం పంచి, పేదలకు విషం ఇస్తుంటే చూస్తూ ఊరుకోము. శోద అనే కంపెనీ గత రెండేళ్లుగా రూ.2 కోట్ల లాభం మాత్రమే ఆర్జించిన ఒక చిన్న కంపెనీ. ఇక, ఢిల్లీలో ఉన్న నీ బీజేపీ దోస్తులు కూడా నిన్ను కాపాడడం కష్టమే. దేశంలో న్యాయ వ్యవస్థ బలంగా, నిజాయతీగా ఉంది. ఆదర్శ్ కుంభకోణంలో అశోక్ చవాన్ లాగా నువ్వు దొరికావు... రాజీనామా తప్పదు" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

# కొనసాగుతున్న ఇజ్రాయెల్ వేట... హిజ్బొల్లా డిప్యూటీ హెడ్ కూడా హతం

- మొదటి పేజీ తరువాయి

రాలేదు. సోషల్ మీడియాలో మాత్రం అతడి మృతికి సంతాప ప్రకటనలు వెలువడుతున్నాయి. హిజ్బొల్లా అగ్రశ్రేణి కమాండర్లలో ఒకడిగా ఉన్న నబిల్ కౌక్ ను అమెరికా కూడా నిషిద్ధ జాబితాలో చేర్చింది. నాలుగేళ్ల కిందట అతడిపై పలు ఆంక్షలు విధించింది.

## రేవంత్ అంకుల్..

# మా ఇల్లు కూల్చేయద్దు ప్లీజ్..

- మొదటి పేజీ తరువాయి

చిన్న పిల్లలను కూడా రోడ్డెక్కేలా చేసిందంటూ మండిపడుతున్నారు.

మూసీ పరివాహక ప్రాంతాల్లో కూల్చివేతలపై బాధితులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిల్లాపాపలతో రోడ్డు మీదికి వచ్చి నిరసనలు చేపడుతున్నారు. ఈ క్రమంలోనే హైదర్శకోటలోని మూసీ పరివాహక ప్రాంతాల్లో కొంతమంది చిన్నారులు కూడా ఆందోళనలో పాల్గొన్నారు. అక్కడికి వచ్చిన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. మా పేరెంట్స్ ను చూస్తే బాధనిపిస్తోందని వాపోయారు. 'మా ఇల్లు మాకు కావాలి.. సీఎం సార్.. ప్లీజ్ హెల్ప్ చేయండి' అంటూ ఓ చిన్నారి మీడియా ద్వారా ముఖ్యమంత్రిని కోరింది.

# తిరుమల శ్రీవారి దర్శనం చేసుకున్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్

- మొదటి పేజీ తరువాయి

మండపంలో అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం అందించారు. అధికారులు తీర్థప్రసాదాలు అందించారు. టీటీడీ ఈవో జె.శ్యామలరావు జస్టిస్ చంద్రచూడ్ కు లామినేషన్ చేసిన వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని బహూకరించారు. అంతకుముందు, సీజేఐ కుటుంబానికి వైకుంఠం క్యూ కాంప్లెక్స్ వద్ద టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్యచౌదరి స్వాగతం పలికారు.

## చంద్రబాబుతో నాకు 18 ఏళ్లుగా

# సోదర అనుబంధం ఉంది

- మొదటి పేజీ తరువాయి

నేపథ్యంలో, చంద్రబాబును కలవడంపై యూసుఫ్ అలీ నేడు సోషల్ మీడియా ద్వారా స్పందించారు. "నన్ను, అమరావతిలో మా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గా ఉన్న నా సోదరుడు అష్రఫ్ అలీని, నా బృందాన్ని ఎంతో సాదరంగా ఆహ్వానించినందుకు గౌరవనీయ ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు. చంద్రబాబుతో నాకు 18 ఏళ్లుగా సోదర అనుబంధం ఉంది. చంద్రబాబుతో నిన్న మేం జరిపిన చర్చలు ఎంతో ఫలప్రదం అయ్యాయి. వైజాగ్ లో అంతర్జాతీయ స్థాయి షాపింగ్ మాల్ ను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ఈ మాల్ లో 8 స్క్రీన్ల ఐమాక్స్ మల్టీప్లెక్స్ కూడా ఉంటుంది. విజయవాడ, తిరుపతిలో అత్యంత అధునాతన సౌకర్యాలు కలిగిన హైపర్ మార్కెట్లును ఏర్పాటు చేయబోతున్నాం. అంతేకాకుండా, ఏపీ వ్యాప్తంగా ఆధునిక ఫుడ్ ప్రాసెసింగ్, లాజిస్టిక్ సెంటర్లను ఏర్పాటు చేస్తాం" అని యూసుఫ్ అలీ ట్వీట్ చేశారు.

# మంగళగిరిలో క్లీన్ అండ్ గ్రీన్... సొంత డబ్బుతో పనులు చేయిస్తున్న మంత్రి నారా లోకేశ్


- మొదటి పేజీ తరువాయి

పిచ్చిమొక్కలు, గడ్డి తొలగించేందుకు ఐదుగురు కార్మికులను నియమించారు. వీరికి అవసరమైన జీతభత్యాలను నారా లోకేశ్ సొంత నిధుల నుంచే వెచ్చిస్తున్నారు. ఒక్కో గ్రాస్ కటింగ్ మిషన్ కొనుగోలుకు రూ.18 వేల వరకు ఖర్చు చేశారు. ఆదివారం ఉదయం నుంచే మంగళగిరి పట్టణంలోని పానకాల శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఘాట్ రోడ్డుతో పాటు పలు ప్రాంతాల్లో యంత్రాల సాయంతో గడ్డిని, పిచ్చి మొక్కలను తొలగించారు. ఆయా పనులను టీడీపీ నాయకులు దగ్గరుండి పర్యవేక్షించారు.

మంగళగిరి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు మంత్రి నారా లోకేశ్ చూపిస్తున్న చొరవ పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# హైదరాబాద్‌లో భారీ వర్షం.. ఈ ఏరియాల్లో కుండపోతగా కురుస్తుందిగా..!

%కుత్బుల్లాపూర్: హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. కుత్బుల్లాపూర్ పరిసర ప్రాంతాలలో ఆదివారం రాత్రి ఉన్నట్టుండి వర్షం కురిసింది. సుచిత్ర, పేట్ బషీరాబాద్, కొంపల్లి, దుండిగల్, మల్లంపేట్, గండి మైసమ్మ, సూరారం, చింతల్, జీడిమెట్ల, షాపూర్ నగర్, గాజులరామారంలో వర్షం కురుస్తుంది. మియాపూర్, శేరిలింగంపల్లి, పటాన్‌చెరు, చందానగర్, గచ్చిబౌలి, కొండాపూర్, రాయదుర్గం, మాదాపూర్‌లో భారీ వర్షం కురిసింది.



హైదరాబాద్‌లో ఆదివారం మధ్యాహ్నం నుంచి పొడిగా ఉన్న వాతావరణం సాయంత్రానికి మారిపోయింది. నల్లటి మబ్బులతో నిండిపోయి చీకటి కమ్మేసింది. ఆఫీసుల నుంచి ఇండ్లకు వెళ్లే టైం కావడం, వీకెండ్ అవడంతో పలు చోట్ల భారీగా ట్రాఫిక్ జాం అయింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. ట్రాఫిక్ కారణంగా మెట్రో రైళ్లకు మరింత రద్దీ పెరిగింది.

# ఎమ్మెల్యే రాజా సింగ్ ఇంటి ముందు యువకుల రెక్కీ..?

- మొదటి పేజీ తరువాయి

అక్కడికి చేరుకున్న పోలీసులు.. యువకులను అదుపులోకి తీసుకుని మంగళ్ హాట్ పోలీస్ స్టేసన్ కు తరలించారు.

ఎమ్మెల్యే ఇంటి వద్ద రెక్కీ కోసమే తిరుగుతున్నారని తేలడంతో ఎమ్మెల్యేపై దాడి చేయడానికే వచ్చారా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. పోలీసులు వెల్లడించిన సమాచారం ప్రకారం.. షేక్ ఇస్మాయిల్, షేక్ ఖాజా అనే యువకులు రాజా సింగ్ ఇంటి దగ్గర్లో అనుమానాస్పదంగా తిరగడం చూసి స్థానికులు పట్టుకున్నారు. ఆ యువకులు ఇద్దరినీ మంగళ్ హాట్ స్టేషన్ కు తరలించి విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు. ఇద్దరి ఫోన్లలోనూ ఎమ్మెల్యే రాజా సింగ్ ఫొటోలు ఉన్నాయని, వాటితో పాటు గన్, బుల్లెట్ల ఫొటోలు ఉన్నాయని చెప్పారు.

# విషాహారం నేల నుంచి నోటిదాకా.. అన్నింటా రసాయన అవశేషాలే



పండించే నేల..తినే ఆహారం..నిల్వ చేసే పద్ధతులు.. అన్నింటా రసాయన అవశేషాలే కనిపిస్తున్నాయి. 'ఏ పుట్టలో ఏ పాము ఉన్నదో అన్నట్టు' ఏది తినాలన్నా.. 'ఎందులో ఏ రసాయనం ఉందో?' అని ఆలోచించాల్సి వస్తోంది. అంతగా కలవరపెడుతున్న సమస్య ఇది. మొన్నటి వరకు 'ప్యాకేజ్డ్ ఫుడ్‌లో కెమికల్స్ ఉంటాయి. అందుకే వాటికి ఎంత దూరంగా ఉంటే అంత మేలు' అనుకునేవాళ్లు. ఆ విషయం తెలిసినప్పటికీ పూర్తిగా ప్యాకేజ్డ్ ఫుడ్‌ను తినడం ఆపడంలేదు చాలామంది. దానివల్లే అనారోగ్య సమస్యలు వస్తున్నాయని ఎక్స్‌పర్ట్స్ చెప్తున్నా ఎక్కువమంది వినడంలేదు.

ఇదే ఒక సమస్య అనుకుంటే మరో షాకింగ్ న్యూస్ తెరమీదకు వచ్చింది. అందరికీ తిండి పెట్టేందుకు అహర్నిశలు శ్రమించే రైతుకు పెద్ద కష్టం వచ్చిపడింది. అన్నదాత ఆరోగ్యం మీద పెస్టిసైడ్స్ ప్రభావం తీవ్రంగా ఉంటోంది. అసలు ఇంతలా పెస్టిసైడ్స్ ఎందుకు వాడాల్సి వస్తోంది? పండించే పంట నుంచి ప్యాకేజ్డ్ ఫుడ్ వరకు రసాయనాల జాడ ఉండాల్సిందేనా? అవి లేని ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినలేమా?

రా మయ్యకు వ్యవసాయం చేయడమంటే చాలా ఇష్టం. తనకున్న నాలుగెకరాల పొలాన్ని ఎంతో అపురూపంగా సాగు చేసుకుంటాడు. ఆ పంటమీద వచ్చిన ఆదాయంతో బిడ్డల్ని సెటిల్ చేశాడు. నమ్ముకున్న పనే చేసుకుంటూ జీవితాన్ని గడపాలనుకునే రామయ్య.. ఊరు విడిచి ఎక్కడికీ వెళ్లడు. ఇన్నాళ్లు అన్నం పెట్టిన నేలను విడిచి వెళ్లడానికి ఇష్టపడడు. అందుకే బిడ్డలు తమ దగ్గరే ఉండమన్నా ఒప్పుకోడు. అలాంటి రామయ్యకు అనుకోని కష్టం వచ్చింది. ఒకసారి తన బిడ్డల్ని చూసొద్దామని సిటీకి వెళ్లాడు. మాటల్లో మాటగా 'ఈ మధ్య ఆయాసంగా ఉంటోంది.

మునుపటిలా పొలం పనులు చేయలేకపోతున్నా. ఒకసారి హాస్పిటల్‌లో చూపించ'మని కొడుకుని అడిగాడు. మరుసటి రోజు రామయ్య కొడుకుతో కలిసి హాస్పిటల్‌కి వెళ్లాడు. అక్కడ టెస్ట్‌లన్నీ చేశారు. ఆయన ఆయాసానికి కారణం పెస్టిసైడ్స్ అన్నారు. అది విని తండ్రీకొడుకులిద్దరూ షాకయ్యారు. ఆ తర్వాత 'రైతుల రక్తంలో పెస్టిసైడ్స్ ఉంటున్నా'యనే వార్తలు చదివాక గానీ ఆ విషయాన్ని నమ్మలేదు వాళ్లు.ఇలాంటివి ఒకటిరెండు కాదు.. మన రాష్ట్రంలోనే వందల సంఖ్యలో ఉన్నాయట! అదే.. దేశవ్యాప్తంగా చూస్తే ఆ సంఖ్య వేలల్లో ఉంటుంది అంటున్నారు సైంటిస్ట్‌లు.

### వ్యవసాయానికి సాయంగా.. రసాయనం!

ఎంత చదువుకున్నప్పటికీ గ్రామాల్లో వ్యవసాయం మీద ఆధారపడే కుటుంబాలు ఎక్కువ. అలాగని ఇతర ప్రాంతాలకు వెళ్లి ఉద్యోగాలు చేయలేకనో, వ్యాపారాలు పెట్టి లాభాలు గడించలేకనో కాదు.. తరతరాలుగా వస్తోన్న వ్యవసాయాన్ని వదులుకోలేక. లాభమైనా, నష్టమైనా 'మన నేల' అనే మమకారంతో జీవిస్తున్నారు చాలామంది రైతులు. నలుగురికీ తిండి పెట్టగలిగే అవకాశం ఉన్నప్పుడు వేరే ఆలోచనలు ఎందుకు? అంటారు వాళ్లు. అందుకే రాత్రి, పగలు అని తేడాలేకుండా ఒళ్లొంచి కష్టపడతారు రైతులు. నేలలో వేసిన విత్తనాలన్నీ మొక్కలుగా మారాలని కోరుకుంటాడు రైతు. పంట చేతికి వచ్చేవరకు రక్షించుకోవడం ఎంత కష్టమో ఆ రైతుకే తెలుసు. ఎందుకంటే మొక్క ఎదిగేటప్పుడు కీటకాలు, చీడపురుగులు, తెగుళు వంటివి వస్తాయి. వాటివల్ల పంట దెబ్బతింటుంది. అందుకే ఎంత కష్టపడైనా పంటను కాపాడాల నుకుంటాడు రైతు. ఆ కాపాడుకునే క్రమంలో రకరకాల పద్ధతుల మీద ఆధారపడాల్సి ఉంటుంది. వాటిలో ఆగ్రో కెమికల్స్ ఒకటి. అందులో ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, మైక్రో న్యూట్రియెంట్స్ వంటివి ఉంటాయి. పంట మీద దాడిచేసే పురుగుల్ని చంపేందుకు రకరకాల పెస్టిసైడ్స్ ఉన్నాయి. అయితే ఆ పురుగుమందుల వల్ల పంటకు కలిగే లాభం గురించే ఆలోచిస్తారు తప్ప పరోక్షంగా తమకు జరిగే నష్టం గురించి ఆలోచించడంలేదు రైతులు. ఆలోచించడం లేదు అనేకంటే కూడా అవగాహన ఉండడం లేదని చెప్పొచ్చు. పురుగు మందులు వాడేటప్పుడు ఎలాంటి సేఫ్టీ మెజర్స్ తీసుకోవాలో కూడా చాలామంది రైతులకు అవగాహన ఉండదు. ఆ కారణాల వల్ల దీర్ఘకాలంలో రైతులకు అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. పంటకు మేలు కోసం రసాయనం వాడితే... మొదటికే మోసం అన్న చందాన తయారైంది పరిస్థితి.

### మన రాష్ట్రంలో...

పంటలకు వాడే పెస్టిసైడ్స్ వాడకం ఏయేటికాయేడు పెరుగుతూపోతోంది. వాటివాడకం వల్ల రైతుల ఆరోగ్యం దెబ్బతింటోంది. పురుగుమందుల వాడకంతో ఆస్తమా లాంటి శ్వాసకోశ వ్యాధులతోపాటు స్కిన్ అలర్జీస్, అల్జీమర్స్, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులబారిన రైతులు పడుతున్నట్టు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్), ఉస్మానియా బయోకెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ సైంటిస్ట్‌లు చేసిన రీసెర్చ్‌లో తేలింది. ఈ స్టడీలో భాగంగా రైతుల రక్తం, మూత్రాలను టెస్ట్ చేశారు. ఆ నమూనాల్లో పదుల సంఖ్యలో వ్యాధుల బారిన పడే లక్షణాలు ఉన్నట్టు తేలింది.

ఈ రీసెర్చ్ ఆర్టికల్ డచ్ అకడమిక్ పబ్లిషింగ్ కంపెనీ 'ఎల్సెవియర్' అనే మ్యాగజైన్‌లో పబ్లిష్ అయింది. తెలంగాణ రాష్ట్రంలో చేసిన స్టడీలో భాగంగా వికారాబాద్, యాదాద్రి, సంగారెడ్డి జిల్లాలకు చెందిన 493 మంది రైతుల బ్లడ్, యూరిన్ శాంపిల్స్ టెస్ట్ చేశారు. వీళ్లలో పురుగు మందుల ప్రభావానికి గురైన గ్రూప్‌కు చెందిన 341 మంది రైతులు, ఎఫెక్ట్ కాని వాళ్లు152 మంది రైతులు ఉన్నారు. ఈ స్టడీ 2021 అక్టోబర్ నుంచి 2023 ఏప్రిల్ మధ్య చేశారు. ఒక్కో జిల్లాలో ఐదు గ్రామాలను ఎంపిక చేశారు. కనీసం ఒక ఏడాది కాలం పెస్టిసైడ్స్ పిచికారీ చేసిన వరి, పత్తి, ఇతర పంటలు పండించే రైతుల శాంపిల్స్ మాత్రమే తీసుకున్నారు. వాళ్లలో18 ఏండ్ల నుంచి 70 ఏండ్ల మధ్య వయసుగల రైతులు ఉన్నారు.

### ఊపిరాడట్లేదని...

వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూహెచ్ఓ) మార్గదర్శకాల ప్రకారం అత్యంత ప్రమాదకరమైనవిగా గుర్తించిన11 రకాల పెస్టిసైడ్స్‌తో సహా 28 రకాల వేర్వేరు పురుగుమందు అవశేషాలను రైతుల రక్త నమూనాల్లో గుర్తించారు. వాటిలో కౌమఫాస్, ఫెనామీఫాస్, డిక్లోర్వోస్, మెతామిడోఫాస్, మోనోక్రోటోఫాస్, ట్రయజోఫాస్ ఉన్నాయి. పురుగుమందులు వాడని, వాటి ఎఫెక్ట్ కాని రైతుల బ్లడ్ శాంపిల్స్‌తో పోలిస్తే.. పురుగుమందుల పిచికారీ చేసే రైతుల బ్లడ్ శాంపిల్స్‌లో పెస్టిసైడ్స్ అవశేషాలు ఎక్కువగా ఉన్నట్టు తేలింది.

పురుగుమందులను పిచికారీ చేసినప్పుడు ఎదురయ్యే సమస్యలపై రైతులను అడిగితే.. ఊపిరి సరిగా ఆడకపోవడం, ఛాతిలో నొప్పి, గుండె వేగంగా కొట్టుకోవడం, వాంతులు కావడం వంటి లక్షణాలు ఉంటున్నాయని కొందరు చెప్పారు. మరికొందరు కంట్లో దురద, కోపం, కళ్లు మసకబారడం, తలనొప్పి, తలతిరగడం, నడుస్తుంటే బ్యాలెన్స్ తప్పడం, తిమ్మిరి, కండరాల బలహీనత వంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు చెప్పారు.

### ఎక్కువగా ఆ పంటలకే..

మన రాష్ట్రంలో వరి, పత్తి, మిర్చి, ఇతర పంటలకు చీడపీడలు ఎక్కువ. దాంతో పెస్టిసైడ్స్ ఎక్కువగా వాడుతున్నారు. పంట దిగుబడి, లాభాలు పెంచుకునేందుకు వాణిజ్య పంటలను సాగు చేస్తూ, వాటి మీద మోతాదుకు మించి పురుగు మందులను పిచికారీ చేస్తున్నారు. పెస్టిసైడ్స్ ఎక్కువగా వాడడం వల్ల వచ్చే నష్టాల గురించి పిచికారీ చేసేటప్పుడు తీసుకోవాల్సిన సేఫ్టీ పద్ధతుల గురించి రైతులకు తగినంత అవగాహన లేదని ఆ స్టడీ చెప్తోంది. గ్లౌస్‌లు వేసుకోకుండా నేరుగా చేతులతో పురుగుమందులను కలపడం, సేఫ్టీ లేని పద్ధతిలో నిల్వ చేయడం, ఎక్కడపడితే అక్కడ పెస్టిసైడ్స్ పడేస్తున్నారు. పురుగుమందుల పిచికారీ సమయంలో చర్మం, ఊపిరితిత్తుల మీద ఎటువంటి ప్రభావం పడకుండా ఉండాలంటే పర్సనల్ సేఫ్టీ డివైజ్‌లు వాడాలి. అలాగే, పెస్టిసైడ్స్ వాడకాన్ని తగ్గించేందుకు బయో పెస్టిసైడ్స్, నాణ్యమైన విత్తనాలతో పాటు ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ పద్ధతులు పాటించాలని రీసెర్చ్ టీం హెచ్చరించింది.

### ఆ రైతుకేం తెలుసు?

ఒకప్పుడు వ్యవసాయం చేసినవాళ్లలో చాలామంది చదువుకున్న వాళ్లు కాదు. అందుకని వాడుతున్న పురుగుమందుల మీద సరైన అవగాహన ఉండదు. ఏ పంటకు ఏ మందు పనికొస్తుంది? ఎప్పుడు మందు కొట్టాలి? వంటి విషయాలు మాత్రమే తెలుస్తాయి. వాటిని వాడేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చెప్పినా పెద్దగా పట్టించుకునేవారు కాదు. ఆ మందుల డబ్బాలపై జాగ్రత్తలు రాసి ఉన్నా చదవలేరు. చదివినా పాటించరు. కారణం... సేఫ్టీ మెజర్స్ తీసుకోకపోవడం వల్ల జరిగే నష్టం గురించి అవగాహన తక్కువ ఉండడం లేదా ఏమవుతుందిలే అనే నిర్లక్ష్యం వల్ల రసాయనాలకు ఎక్స్‌పోజ్ అవుతున్నారు. పెస్టిపైడ్స్ ఎఫెక్ట్ వెంటనే ఆరోగ్యం మీద చూపించకపోవడం వల్ల కూడా అవి వాడేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవడం గురించి పట్టించుకోరు ఎక్కువమంది. వాటి ప్రభావం ఎప్పటికో చాలా కాలం తరువాత ఉంటుంది. అప్పుడు జబ్బు చేశాక టెస్ట్‌ల్లో వచ్చే రిపోర్ట్‌లు చూశాక కానీ అనారోగ్యానికి కారణం రసాయనాలు అని తెలియడంలేదు.ఒకప్పటిలా పంట కోసం ఎదురు చూసే టైం ఇప్పుడు లేదు. విత్తనాలు వేయగానే పంట చేతికి రావాలి అన్నట్టు ఉంది పరిస్థితి. దాంతో పొలంలో విత్తనాలు నాటింది మొదలు పంట చేతికొచ్చేవరకు రసాయన ఎరువులు వాడుతున్నారు. రసాయనాలు లేని మందులు షాపుల్లో కూడా దొరకట్లేదు. దాంతో చేసేదేమీ లేక వాటినే తెచ్చుకుంటున్నారు. పురుగు చావడానికి, మొక్క ఏపుగా పెరగడానికి అని అడ్వర్టైజ్‌మెంట్లలో చూపించే హానికర ఎరువులు వాడుతున్నారు. పంట బాగా రావాలనే కోరికతో టీవీ, పేపర్ యాడ్స్, సేల్స్ రిప్రజెంటేటివ్స్ మాటలు నమ్మి ఆ మందుల్ని కొంటున్నారు, వాడుతున్నారు.

### పరిస్థితుల ప్రభావం

పరిస్థితులు అనుకూలంగా ఉంటేనే ఏదైనా పని జరుగుతుంది. వ్యవసాయానికి కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది. కరువుకాటకాలు, పంట దెబ్బ తినడం, తరుచుగా జరిగే పంటనష్టాలు ఉంటూనే ఉంటాయి. ఆహార ధాన్యాల ఉత్పత్తి 1950 %-% 51నాటికి 51 మిలియన్ టన్నులుగా ఉంటే 2021 %-% 22 నాటికి 314 మిలియన్ టన్నులుగా ఉంది. ఇవన్నీ ఒక ఎత్తయితే.. ఇండియా ఎదుర్కొన్న సవాళ్లు మరో ఎత్తు. ఇండియాలో వ్యవసాయం చేయాలంటే విత్తనాల నుంచి మార్కెట్ వరకు ఎన్నో సవాళ్లు ఎదుర్కోవాల్సి వస్తుంది. గ్లోబల్‌గా 60 రకాల నేలలు ఉంటే... అందులో 46 రకాలు ఇండియాలో ఉన్నాయి. దాంతోపాటు15 రకాల వాతావరణ పరిస్థితులు ఉంటాయి.

ఇవన్నీ పక్కన పెడితే.. ఈ పంటలు పండించడానికి రైతులు వాడే పెస్టిసైడ్స్, ఫెర్టిలైజర్స్ ప్రమాదకరంగా మారుతున్నాయి. ఈ రెండు రకాల రసాయనాలు మోడర్న్ అగ్రికల్చర్‌లో భాగంగా పంట నష్టం రాకుండా ఉండేందుకు, పంట దిగుబడి ఎక్కువ రావడం కోసం వాడతారు. వీటివల్ల ఎక్కువ పంట చేతికొస్తుంది. క్వాలిటీ బాగుంటుంది. పెస్టిసైడ్స్‌లో ఇన్‌సెక్టిసైడ్స్, ఫంగిసైడ్స్, హెర్బిసైడ్స్ వంటివి ఉంటాయి. అవి కలుపు, చీడపురుగుల్ని నాశనం చేస్తాయి. పంట దిగుబడి పెరిగేందుకు ఉపయోగపడతాయి. ఈ కారణంగానే వాటిని వాడుతున్నారు. అయితే, ఇండియాలో వాడే పెస్టిసైడ్స్‌లో ఇన్ సెక్టిసైడ్స్ ఉంటాయి. అయినప్పటికీ దేశంలో ఒక్క శాతం మాత్రమే పెస్టిసైడ్స్ వాడుతున్నారు. దాదాపు 58,160 మిలియన్ టన్నుల పెస్టిసైడ్స్ వాడినట్లు 2018 రిపోర్ట్ చెప్తోంది.

### ఇండియాలో అప్పుడు మొదలైంది

ఇండియాలో1952లో పెస్టిసైడ్ ప్రొడక్షన్ మొదలైంది. దాంతోపాటు బెంజీన్ హెగ్జాక్లోరైడ్, డీడీటీ. పెస్టిసైడ్స్‌ని తయారుచేసే దేశాల్లో ఇండియా రెండో అతిపెద్ద తయారీదారు. పెస్టిసైడ్స్ తయారుచేయడమనేది చాలాకాలంపాటు కొనసాగుతుంది. 1998 నాటికి అది102, 240 మిలియన్ టన్నులకు పెరిగింది. రిజిస్ట్రేషన్ అయిన పెస్టిసైడ్స్ 145 రకాల ఇన్‌సెక్టిసైడ్స్ ఉన్నాయి. ఆసియాలోనే ఏడాదికి 90 వేల మిలియన్ టన్నుల పెస్టిసైడ్స్ ఉత్పత్తి చేస్తోంది ఇండియా. ప్రపంచవ్యాప్తంగా చూసుకుంటే పెస్టిసైడ్స్ తయారు చేసే దేశాల్లో12వ స్థానం మన దేశానిది. 2022%-%23 ఏడాదికిగానూ ఫెర్టిలైజర్ ప్రొడక్షన్ 58.4%. మొత్తం వాడకం 57.9 శాతం. దిగుమతులు 35.9 శాతంగా ఉంది. ఇండియాలో పెస్టిసైడ్స్‌ను ఐదు రకాలుగా విడదీశారు. అందులో అగ్రికల్చర్, పెస్టిసైడ్స్. వీటిలో పెస్ట్స్, ఫంగిసైడ్స్, ఇన్‌సెక్టిసైడ్స్, హెర్బిసైడ్స్, రొడెంటిసైడ్స్. ఉదాహరణకు.. ఫంగిసైడ్స్ ఫంగైని, ఇన్‌సెక్టిసైడ్స్ కీటకాలను, హెర్బిసైడ్స్ కలుపును నాశనం చేస్తాయి. మార్కెట్ షేర్‌లో ఇన్ సెక్టిసైడ్స్ వాటా 60 శాతం. ఫంగిసైడ్స్18 శాతం, హెర్బిసైడ్స్ 16 శాతం, మిగతావి 6 శాతం.

### బయో పెస్టిసైడ్స్

ఇవి నాన్ టాక్సిక్ నేచర్ కలిగి ఉంటాయి. కానీ వీటికి మార్కెట్ తక్కువ. 1999 %-% 2000 నాటికి ఇన్‌సెక్టిసైడ్స్ వాడకం చూస్తే 60 శాతం ఉంది. ఫంగిసైడ్స్ 21 శాతం, హెర్బిసైడ్స్ 14 శాతం, మిగతావి 5 శాతం ఉంటాయి.

### ఎదుర్కోవాల్సిన సవాళ్లు

చీడపురుగుల్ని నాశనం చేసేందుకు పెస్టిసైడ్స్, ఫెర్టిలైజర్స్‌ని కనిపెడితే... అవి ఫుడ్ ప్రొడక్షన్‌ని పెంచాయి. దాంతోపాటు ప్రొడక్షన్‌లో తిరుగులేని విజయాలు చూశాయి. అయితే అవి నేలను నిస్సారం చేయడం, ఆరోగ్యం మీద దెబ్బకొట్టడం, పర్యావరణ కాలుష్యం... ఒక్కమాటలో చెప్పాలంటే కాలుష్యం అనేది అంతటా జరిగింది. ఏడాదికి దాదాపు 5,3 బిలియన్ టన్నుల నేల నిస్సారమైపోతోంది. ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ అంచనా ప్రకారం.. చీడపురుగులు, కలుపు, తెగుళ్ల వల్ల 40 శాతం పంటనష్టం జరుగుతోంది. కోత కోశాక 6 నుంచి 7 శాతం నష్టం ఉంటోంది.

## హాస్పిటల్ ముందు పార్క్ చేసిన బైక్‌లను వేషాలు మార్చి కొట్టేసే ముఠా అరెస్ట్



సికింద్రాబాద్: వేషాలు మారుస్తూ ప్రభుత్వ ఆసుపత్రిలో పార్కు చేసిన బైక్ లను చోరి చేస్తున్న దొంగల ముఠాను చిలకలగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. కామారెడ్డి జిల్లాకు చెందిన శ్రీనివాస్ హైదరాబాద్ తోపాటు వివిధ జిల్లాల్లోని ప్రభుత్వ ఆసుపత్రిలో పార్కు చేసిన ద్విచక్ర వాహనాలను దొంగిలించి తక్కువ ధరకు ముగ్గురు వ్యక్తులకు అమ్ముతున్నాడు. వచ్చిన డబ్బులతో జల్సాలు చేసేవాడు. గత 3 సంవత్సరాల నుంచి ఇదే పనిగా దొంగతనాలు చేస్తున్నా ఇప్పటి వరకు పట్టుపడలేదని సౌత్ ఈస్ట్ జోన్ డిసిపి బాలస్వామి తెలిపారు.

శ్రీనివాస్ తో పాటు దొంగలించిన బైక్ లను కొనుగోలు చేసే ముగ్గురు వ్యక్తులు ఏసురత్నం, శాంతారావు, అన్నగాని శ్రీనులను అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ.10 లక్షల విలువైన 18 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు డిసిపి బాలస్వామి వెల్లడించారు. గాంధీ ఆసుపత్రిలో దొంగతనం చేస్తుండగా సిసి ఫుటేజీ ద్వారా గుర్తించి అరెస్టు చేశామని డిసిపి పేర్కొన్నారు. తక్కువ ధరకు వస్తున్నాయని బైక్ లను ఎవరు కొనవద్దని డాక్యుమెంట్లు ఉన్న తర్వాతనే వాటిని కొనుగోలు చేయాలని ప్రజలకు డీసీపీ బాలస్వామి సూచించారు.

## ఎన్నికల ప్రచారంలో మల్లిఖార్జున ఖర్గేకు అస్వస్థత



జమ్మూకశ్మీర్ ఎన్నికల ప్రచారంలో %ూ×జజ%చీఫ్ మల్లికార్జున ఖర్గే అస్వస్థతకు గురయ్యారు. కథువా బహిరంగ సభలో మాట్లాడుతూ.. ఉన్నట్టుండి అదుపు తప్పి కింద పడబోయారు. పక్కనే ఉన్న నేతలు ఖర్గేను కిందపడకుండా పట్టుకున్నారు. కాస్తన్ని నీళ్లు తాగిన ఖర్గే.. మళ్లీ ప్రసంగం కొనసాగించారు. ఆయన అస్వస్థతకు గురికాక ముందే తనకు ఎనబై మూడేళ్లు అయినప్పటికీ.. ఫిట్ గా ఉన్నాని అన్నారు. మోదీ సర్కార్ ను గద్దె దించే వరకు బతికే ఉంటానన్నారు ఖర్గే. జమ్ము కాశ్మీర్ కు మళ్లీ రాష్ట్ర హోదా వచ్చే వరకు కాంగ్రెస్ పోరాడుతుందని ఆయన అన్నారు. కతువాలో ఉగ్రవాదులతో జరుగుతున్న ఆపరేషన్‌లో మరణించిన హెడ్ కానిస్టేబుల్‌కు నివాళులు అర్పిస్తున్న సమయంలో వేదికపై ఉన్న ఖర్గే తల తిరుగుతున్నట్లు అనిపించింది. ఖర్గే సహచరులు ఆయన్ని పట్టుకొని కుర్చీలో కూర్చోబెట్టారు. కాంగ్రెస్ చీఫ్ ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నారని, వైద్యులు ఆయనకు చికిత్స అందిస్తున్నారని పార్టీ నేతలు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులకు మద్దతు కూడగట్టే ర్యాలీలో ప్రసంగించేందుకు ఖర్గే జస్రోటాకు వెళ్లారు. ఉదంపూర్ జిల్లాలోని రాంనగర్‌లో జరిగే మరో బహిరంగ ర్యాలీలో ఈరోజు కూడా ఆయన ప్రసంగించనున్నారు.

## నేపాల్‌లో వరద బీభత్సం : కొట్టుకుపోతున్న వంతెనలు.. 148కి చేరిన మృతుల సంఖ్య



నేపాల్ రాజధాని ఖాట్మండులో గత మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలు వరద బీభత్సాన్ని సృష్టిస్తున్నాయి. భారీ వరదల కారణంగా కొండచరియలు విరిగిపడిన పడుతున్నాయి. రోడ్లపై ప్రయాణించే బస్సులు, ఇతర వాహనాల ప్రమాదాలకు గురైయ్యాయి. రెస్క్యూ టీం డజన్ల కొద్దీ మృతదేహాలను స్వాధీనం చేసుకుంటున్నారు. వరదల కారణంగా మరణించిన వారి సంఖ్య కనీసం 148కి పెరిగింది. పదుల సంఖ్యలో జనాలు వరద జలాల్లో గల్లంతు అయినట్లు అధికారులు తెలిపారు. ఖాట్మండుకు వెళుతున్న రెండు బస్సుల నుంచి 14 మృతదేహాలను శనివారం రాత్రి వెలికితీశారు.

ఖాట్మండు నుంచి 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న అదే స్థలంలో ఆదివారం మరో 23 మృతదేహాలను బయటకు తీశారు సహాయక బృందాలు. ఇంకా గల్లంతు అయిన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఖాట్మండులోని మూడు హైవేలుపై ఆదివారం కొండచరియలు విరిగిపడ్డాయి. భారీ వరదల్లో పలు వంతెనలు కొట్టుకుపోయాయి. నేపాల్‌లోని భయానక పరిస్థితుల వీడియోలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అనేక బ్రిడ్జ్ లు కూలి పోయి వరద ఉదృతిలో కొట్టుకుపోతున్నాయి.

## ఇవెక్కడి గలీజు డ్యాన్సులు.. హైదరాబాద్ పాతబస్తీలోని బండ్లగూడలో..



హైదరాబాద్: పాతబస్తీ బండ్లగూడలో ముజ్రా పార్టీని టాస్క్ ఫోర్స్ పోలీసులు భగ్నం చేశారు. నలుగురు ట్రాన్స్‌జెండర్లతో పాటు 8 మంది యువకులు.. మొత్తం 12 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బండ్లగూడ గౌస్‌నగర్‌లోని లేక్‌వ్యూ హిల్స్‌లో కాంపౌండ్ వాల్ ఉన్న ఒక ఫ్లాట్‌లో గుట్టు చప్పుడు కాకుండా ముజ్రా పార్టీ నడిచింది. అయితే ఈ పార్టీ గురించి పక్కా సమాచారంతో సౌత్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు రైడ్ చేశారు.బండ్లగూడలోని లేక్ వ్యూ హిల్స్ గౌస్ నగర్‌లో కాంపౌండ్ వాల్ ఉన్న ప్లాట్‌లో ఆర్గనైజ్డ్ ముజ్రా పార్టీ జరుగుతుందని గుర్తించారు. నలుగురు ట్రాన్స్‌జెండర్లతో కలిసి 8 మంది యువకులు అశ్లీల నృత్యాలు చేస్తూ పోలీసులకు అడ్డంగా దొరికిపోయారు. ట్రాన్స్‌జెండర్లు అసభ్యకరమైన వస్త్రధారణలో ఉండి యువకులతో కలిసి చిందులేశారు. పెద్ద పెద్దగా కేకలేస్తూ.. పాటలు పెట్టుకుని డ్యాన్సులు చేస్తున్నట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు గుర్తించారు. వీరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ఒక యాంప్లిఫైయర్‌ను, ఒక లౌడ్ స్పీకర్ బాక్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.

## కోల్‌కతా ట్రైనీ డాక్టర్ అత్యాచారం, హత్య జరిగిన హాస్పిటల్‌లోనే పోస్టుమార్టం..?




దేశ వ్యాప్తంగా కలకలం రేపిన కోల్‌కతా హత్యాచార బాధితురాలైన ట్రైనీ డాక్టర్ శవపరీక్షను ఆర్జీ కర్ హాస్పిటల్‌లోనే నిర్వహించారు. బాధిత జూనియర్ డాక్టర్ మృతదేహానికి ఆర్జీ కర్ హాస్పిటల్‌లో ఎందుకు పోస్ట్‌మార్టం నిర్వహించారన్న దానిపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. అక్కడి డాక్టర్లు, మృతురాలి తండ్రి డిమాండ్ మేరకు బాధితురాలు విధులు నిర్వహించిన మెడికల్ కాలేజీలోనే పోస్ట్‌మార్టం జరిగిందని పోలీస్ వర్గాలు తెలిపాయి. సాక్ష్యాలను తారుమారు చేసేందుకే అరెస్టైన మెడికల్ కాలేజ్ మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్ ప్రభావంతో బాధితురాలి సొంత మెడికల్ కాలేజీలోనే పోస్టుమార్టం నిర్వహించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి.

పోస్ట్‌మార్టానికి ముందు జూనియర్ డాక్టర్లు, బాధితురాలి తండ్రి ఐదు డిమాండ్లు చేశారు. జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పర్యవేక్షణలో, మహిళా డాక్టర్ల సమక్షంలో ఆర్జీ కర్ మెడికల్ కాలేజీలోనే పోస్టుమార్టం నిర్వహించాలని, అది వీడియో రికార్డ్ చేయాలని కోరారు. లిఖితపూర్వక డిమాండ్లను ఆగస్టు 9న అప్పటి ప్రిన్సిపాల్‌కు సమర్పించారు. బాధితురాలి తండ్రి, మెడికల్ కాలేజీ ఇద్దరు వైద్యులు దీనిపై సంతకం చేశారు. అవుట్‌పోస్ట్ పోలీసుల ద్వారా డీసీపీకి ఈ లేఖను పంపారు.నిరసన చేసిన వైద్యుల డిమాండ్ల మేరకు ఆర్జీ కర్ హాస్పిటల్‌లోనే ట్రైనీ డాక్టర్ మృతదేహానికి శవపరీక్ష జరిగిందని కోల్‌కతా పోలీస్ ఉన్నతాధికారి ధృవీకరించారు. ఈ ప్రక్రియను వీడియో రికార్డ్ చేయడంతోపాటు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పర్యవేక్షించినట్లు తెలిపారు. అయినప్పటికీ పోస్టుమార్టం ప్రక్రియలో చిత్తశుద్ధిని కొందరు జూనియర్ డాక్టర్లు ప్రశ్నించడంపై ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అలాగే ఈ లెటర్ బయటకు రావడంతో జూనియర్ వైద్యుల తీరుపై టీఎంసీ నేతలు కూడా అనుమానం వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 9న రాత్రి విధుల్లో ఉన్న జూనియర్ డాక్టర్‌పై అత్యాచారంతోపాటు హత్య జరిగింది. సంచలనం రేపిన ఈ కేసుపై సీబీఐ దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే.

# బంగ్లాదేశ్‌తో టీ20 సిరీస్.. గైక్వాడ్‌కు మరోసారి అన్యాయం



టీమిండియా యువ బ్యాటర్ రుతురాజ్ గైక్వాడ్ కు మరోసారి నిరాశ తప్పలేదు. అతనికి బంగ్లాదేశ్ తో జరగబోయే మూడు టీ20 ల సిరీస్ కు చోటు దక్కలేదు. టీ20 క్రికెట్ లో అద్భుత రికార్డ్ ఉన్నా.. గైక్వాడ్ కు ఛాన్స్ దక్కపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. చివరిసారిగా జింబాబ్వే సిరీస్ లో 66 యావరేజ్ తో 133 పరుగులు చేసినా ఈ యువ బ్యాటర్ ను సెలక్టర్లు కరుణించలేదు. దీంతో బీసీసీఐ..అతడికి బీసీసీఐ అన్యాయం చేస్తుందని ఫ్యాన్స్ అంటున్నారు. దగైక్వాడ్ చివరి 7 అంతర్జాతీయ టీ20 ఇన్నింగ్స్ లో 71 యావరేజ్ తో పరుగులు చేశాడు. ఇందులో గత ఏడాది ఆస్ట్రేలియాపై చేసిన ఒక సెంచరీ కూడా ఉంది. అంతకముందు శ్రీలంకతో జరిగిన మూడు టీ20ల సిరీస్ కు గైక్వాడ్ కు స్థానం దక్కలేదు. ప్రస్తుతం గైక్వాడ్ ఇరానీ ట్రోఫీ ఆడేందుకు సిద్ధంగా ఉన్నాడు. అతను రెస్టాఫ్ ఇండియాకు కెప్టెన్సీ చేస్తున్నాడు. ఇటీవలే దులీప్ ట్రోఫీలో ఇండియా సి తరపున కెప్టెన్సీ చేసి ఆకట్టుకున్నాడు. బంగ్లాదేశ్‌తో మూడు టీ20ల సిరీస్‌కు శనివారం (సెప్టెంబర్ 29) జట్టును ప్రకటించారు. సూర్యకుమార్ కెప్టెన్సీలో మొత్తం 15 మందితో కూడిన టీమ్‌ను ఎంపిక చేశారు. స్పీడ్‌తో బౌలింగ్ చేసిన మయాంక్ యాదవ్‌కు తొలిసారి పిలుపు అందింది. మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి మూడేండ్ల తర్వాత నేషనల్ టీమ్‌లోకి వచ్చాడు. అక్టోబర్ 6, 9, 12న వరుసగా గ్వాలియర్, ఢిల్లీ, హైదరాబాద్‌లో మ్యాచ్‌లు జరగనున్నాయి.


**బంగ్లాదేశ్‌తో టీ20 సిరీస్‌కు భారత జట్టు:**

సూర్యకుమార్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, శాంసన్, రింకూ సింగ్, పాండ్యా, పరాగ్, నితీశ్ కుమార్, శివం దూబే, సుందర్, బిష్ణోయ్, వరుణ్ చక్రవర్తి, జితేష్, అర్ష్‌దీప్, హర్షిత్ రాణా, మయాంక్ యాదవ్.

# వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్.. భారత్, ఆసీస్‌ను వణికిస్తున్న శ్రీలంక

వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్ మ్యాచ్ కు మరో 8 నెలల సమయం మాత్రమే ఉంది. మరోసారి డబ్ల్యూటీసీ ఫైనల్ భారత్, ఆసీస్ ఆడడం ఖాయమన్న దశలో శ్రీలంక ఈ రేస్ లోకి దూసుకొస్తోంది. లంక తమ సొంతగడ్డపై న్యూజిలాండ్ పై 2-0 తేడాతో ఘన విజయం సాధించి పాయింట్స్ టేబుల్ లో మూడో స్థానంలో నిలిచింది. తొలి టెస్ట్ గెలిచి మూడో స్థానంలో నిలిచిన లంక తమ విజయాల శాతాన్ని 55. 56 శాతానికి పెంచుకుంది. బంగ్లాదేశ్‌తో తొలి టెస్టులో ఘన విజయం సాధించిన టీమిండియా వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలో తన అగ్రస్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంది. చెన్నై టెస్టులో విక్టరీ తర్వాత డబ్ల్యూటీసీ పట్టికలో అగ్రస్థానంలో ఉన్న ఇండియా తన పర్సెంటేజ్ పాయింట్లను (పీటీసీ) 71.67 శాతానికి పెంచుకుంది. రెండో స్థానంలో ఉన్న ఆస్ట్రేలియా (62.50 ) కంటే స్పష్టమైన ఆధిక్యంలో ఉంది. ప్రస్తుతం కాన్పూర్ టెస్ట్ డ్రా అయ్యే అవకాశం ఉండడంతో గెలుపు శాతం తగ్గే అవకాశం కనిపిస్తుంది. మరోవైపు శ్రీలంక పాయింట్స్ టేబుల్ లో ఆస్ట్రేలియాకి దగ్గరలో ఉంది. దీంతో తొలి రెండు స్థానాల్లో ఎవరు నిలుస్తారనే విషయంలో ఆసక్తి నెలకొంది. ఆస్ట్రేలియాలో జరగనున్న బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ కీలకం కానుంది. న్యూజిలాండ్ (37.50) ఏకంగా ఏడో స్థానానికి పడిపోయింది. పాకిస్తాన్‌పై రెండు టెస్టుల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన తర్వాత నాలుగో స్థానానికి చేరుకున్న బంగ్లాదేశ్ (39.29 శాతం) ప్రస్తుతం ఐదో స్థానంలో నిలిచింది. ఇంగ్లండ్ (42.19) నాలుగో స్థానంలో ఉంది.





# ప్రభాత్ అదరహో.. అశ్విన్, కమ్మిన్స్‌ను మించిపోయిన లంక స్పిన్నర్

శ్రీలంక స్పిన్నర్ ప్రభాత్ జయసూర్య టెస్ట్ క్రికెట్ లో తగ్గేదే లేదంటున్నాడు. తన స్పిన్ మాయాజాలంతో ప్రత్యర్థి ఆటగాళ్లను చుట్టేస్తున్నాడు. స్వదేశంలో మ్యాచ్ జరిగితే చాలు ఒంటి చేత్తో లంకకు విజయాలను అందిస్తున్నాడు. ముఖ్యంగా గాలేలో ఈ 32 ఏళ్ళ స్పిన్నర్ రికార్డ్ అద్భుతంగా ఉంది. ఆడిన 16 మ్యాచ్ టెస్ట్ మ్యాచ్ లకే ప్రపంచ క్రికెట్ ను తనవైపు తిప్పుకుంటున్నాడు. ఇప్పటివరకు 16 మ్యాచ్ ల్లో ఏకంగా 97 వికెట్లు పడగొట్టాడు. ఈ క్రమంలో తాను టీమిండియా స్పిన్నర్ అశ్విన్.. ఆసీస్ సఫాస్ట్ బౌలర్ కమ్మిన్స్ దాటిపోయాడు. 2021 లో టెస్ట్ అరంగేట్రం చేసిన ప్రభాత్..ఇప్పటివరకు ఏకంగా 9 సార్లు 5 వికెట్ల ఘనతను అందుకోవడం విశేషం. ఒక మ్యాచ్ లో 10 వికెట్ల ఘనతను రెండు సార్లు అందుకున్నాడు. దీంతో టెస్టుల్లో 2021 నుంచి అత్యధిక సార్లు 5 వికెట్ల తీసిన ప్లేయర్ గా నిలిచాడు. మొత్తం 30 ఇన్నింగ్స్ ల్లో ప్రభాత్ 9 సార్లు 5 వికెట్లు పడగొడితే.. అశ్విన్ 7 సార్లు 5 వికెట్ల ఘనతను అందుకున్నాడు. కమ్మిన్స్ 35 మ్యాచ్ ల్లో 5 సార్లు.. లియాన్ 36 ఇన్నింగ్స్ ల్లో నాలుగు సార్లు 5 వికెట్ల ఫీట్ ను సాధించారు.స్వదేశంలో శ్రీలంకలో తాజాగా న్యూజిలాండ్ తో ముగిసిన తొలి టెస్టులో రెండు ఇన్నింగ్స్ లు కలిపి 9 వికెట్లతో చెలరేగి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు ను గెలుచుకున్నాడు. రెండో టెస్టులోనూ చెలరేగి 9 వికెట్లు పడగొట్టి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డును గెలుచుకున్నాడు. జయసూర్య కెరీర్ కళ్లు చెదిరే రీతిలో ప్రారంభమైంది. 2022లో అతను ఆస్ట్రేలియాపై అరంగేట్రం చేసి తొలి టెస్టులోనే 12 వికెట్లు తీసుకొని ఔరా అనిపించాడు. రెండు ఇన్నింగ్స్ లోనూ ఆరేసి వికెట్లు తీశాడు. ఆ తర్వాత పాకిస్థాన్ తో జరిగిన రెండు టెస్టుల్లో మరో 17 వికెట్లు తీసుకున్నాడు. ఆ సిరీస్ లోనూ రెండుసార్లు ఐదుకుపైగా వికెట్లు తీశాడు.



2023 లో ఐర్లాండ్ బ్యాటర్ పాల్ స్టిర్లింగ్‌ను ఔట్ చేసి తన 50వ టెస్టు వికెట్‌ని సాధించి 71 ఏళ్ల నాటి రికార్డును బద్దలు కొట్టాడు. జయసూర్య తన ఏడో టెస్టులో 50 వికెట్ల మార్క్‌ను కొట్టి వెస్టిండీస్‌కు చెందిన ఆల్ఫ్ వాలెంటైన్ రికార్డును బ్రేక్ చేశాడు.తక్కువ మ్యాచ్‌లలో 50 వికెట్ల మైలురాయిని చేరుకున్న స్పిన్నర్‌గా నిలిచాడు. టెస్టు క్రికెట్ లో అత్యంత వేగంగా 50 వికెట్లు తీసుకున్న బౌలర్ రికార్డు ఇప్పటికీ ఆస్ట్రేలియా పేస్ బౌలర్ చార్లీ టర్నర్ పేరిటే ఉంది. అతడు 1988లో ఇంగ్లండ్ తో తన ఆరో టెస్టులోనే 50 వికెట్లు తీశాడు.

## అమీ జాక్సన్ ఎఫర్ట్‌లెస్ స్టైల్ క్వీన్



# దేవర కలెక్షన్స్.. పుష్ప 2 కూడా గట్టిగానే..



ఫస్ట్ డే ఓపెనింగ్స్ అనేది ఏ సినిమాకైనా చాలా కీలకమని చెప్పాలి. సినిమాపై ఏ రేంజ్ బజ్ క్రియేట్ అయ్యిందనేది ఫస్ట్ డే కలెక్షన్లు డిసైడ్ చేస్తాయి. మొదటి రోజు కలెక్షన్లు ఎక్కువ వస్తే, అది సినిమాకి పాజిటివ్ వైబ్ తీసుకొస్తుంది. అందుకే పాన్ ఇండియా సినిమాల మొదటి రోజు కలెక్షన్లను మేకర్స్ అధికారికంగా ప్రకటిస్తారు. తెలుగు పాన్ ఇండియా సినిమాలకు మొదటి రోజే ఈజీగా 150 కోట్లకు పైగా కలెక్షన్లు వస్తున్నాయి. ఈ ఏడాది విడుదలైన ప్రభాస్ కల్కి 2898ఏడీ సినిమాకి మొదటి రోజు ఏకంగా 180 కోట్ల గ్రాస్ కలెక్షన్లు వచ్చాయి. ఇండియన్ బాక్సాఫీస్‌లో మొదటి రోజు అత్యధిక కలెక్షన్లు సాధించిన సినిమాగా కల్కి నిలిచింది. ఇకపోతే, యంగ్ టైగర్ ఎన్టీఆర్ దేవర మూవీ ఇటీవలే విడుదలైంది. కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాపై భారీ హైప్ క్రియేట్ అయింది. ఈ సినిమా మొదటి రోజే ఏకంగా 150 కోట్ల గ్రాస్ కలెక్షన్లు సాధించింది. %ూశ్రీంశీ =ఘు౧% - వేగంగా వ్యాపార సామ్రాజ్యం విస్తరిస్తున్న అగ్ర హీరో ఈ ఏడాది ఫస్ట్ డే సెకండ్ హైయెస్ట్ కలెక్షన్లు సాధించిన చిత్రంగా దేవర నిలిచింది, ఇది నిజంగా రేర్ ఫీట్ అని చెప్పాలి. ఇదే స్పీడ్‌లో శని, ఆదివారాలు కూడా భారీ కలెక్షన్లు అందుకోవడం గ్యారెంటీ అని మేకర్స్ భావిస్తున్నారు. నిజానికి ఈ సినిమాకి తెలుగు రాష్ట్రాల్లో తప్ప, నార్త్‌లో పెద్దగా బజ్ లేదు. అయినప్పటికీ, రిలీజ్ ముందు కొంత వరకు నార్త్ ఇండియన్ ఆడియన్స్‌కు చేరువైంది. దీంతో నార్త్ ఇండియాలో దేవర మూవీ 8 కోట్ల వరకు కలెక్షన్లు సాధించినట్లు తెలుస్తోంది. %ూశ్రీంశీ =ఘు౧% - ఒక నటుడికి ఇన్ని డాక్టరేట్లు ఎలా? ఈ మూవీ ఫస్ట్ డే కలెక్షన్లతో ఇప్పుడు పుష్ప 2 మేకర్స్ చాలా జోష్‌లో ఉన్నారనే మాట ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తోంది. ఇందుకు ముఖ్యమైన కారణం ఉంది. దేవర సినిమా మినిమమ్ బజ్‌తోనే ఏకంగా 150 కోట్లకు పైగా కలెక్షన్లు రాబట్టడం అందరికీ ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. పుష్ప 2 చిత్రంపై నార్త్ ఇండియాలో భారీ హైప్ ఉంది. కచ్చితంగా ఈ సినిమా వండర్స్ క్రియేట్ చేస్తుందని మేకర్స్ ఆశిస్తున్నారు. దేవర ఫస్ట్ డే కలెక్షన్లను చూసిన తర్వాత, పుష్ప 2 మొదటి రోజే అంతకుమించి అనేలా గ్రాస్ కలెక్షన్లు సాధిస్తుందని అంచనా వేస్తున్నారు. సినిమాపై ఉన్న హైప్ అలాగే కొనసాగితే, ఆర్‌ఆర్‌ఆర్ ఫస్ట్ డే కలెక్షన్ల రికార్డును సైతం పుష్ప 2 అధిగమించే అవకాశముందని అంచనా వేస్తున్నారు. మన తెలుగు పాన్ ఇండియా సినిమాలకు ప్రపంచవ్యాప్తంగా ఏ స్థాయిలో ఆదరణ లభిస్తుందో దేవర కలెక్షన్లు ప్రూవ్ చేశాయని సినీ విశ్లేషకులు అంటున్నారు. మరి పుష్ప 2 ఎలాంటి రికార్డులను క్రియేట్ చేస్తుందో చూడాలి.

## నేహా శెట్టి: ఎత్నీ సెన్స్‌లో స్టైల్ ఐకాన్



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com